క్లుప్తంగా

ఎస్ఎఫ్ఐ నూతన జిల్లా కమిటీ ఎన్నిక

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఎస్ఎఫ్ఐ నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం యూటీఎఫ్ భవన్‌లో నిర్వహించిన ప్లీనరీ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా గండి సునీల్ కుమార్, జిల్లా కార్యదర్శిగా సగిలి రాజేంద్ర ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులుగా ఎంఆర్ నాయక్, రాహుల్, వినయ్, సహాయ కార్యదర్శులుగా రవి కరిష్మాతో పాటు జిల్లా కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు.

పసుపు కొనుగోలు అక్రమాలపై విచారణ జరపాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: పసుపు కొనుగోలు అక్రమాలపై విచారణ జరపాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వరరావుకు ఏపీ రైతు సంఘం నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీసీఎంఎస్, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ల అండదండలతో పసుపు కొనుగోలులో అక్రమాలు జరిగాయన్నారు. మైదుకూరు పసుపు కొనుగోలు కేంద్రంలో చోటు చేసుకున్న అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలన్నారు.

లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం

కడప వైఎస్ఆర్ సర్కిల్: దేశంలో ఐక్యతతో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందామని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో ఆప్ కీ ఆవాజ్ ముద్రించిన ఇస్లామిక్ నూతన సంవత్సర పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఇస్లామిక్ నూతన సంవత్సరం మొహరం ముస్లింలకు మొదటి సంవత్సరం అని ఇస్లాం అంటే శాంతికి ప్రతి రూపమన్నారు. అలాంటిది ముస్లింలపై కొంత మంది మతోన్మాద శక్తులు, మతతత్వ పార్టీలు పథకం ప్రకారం దాడులు చేస్తున్నారని తెలిపారు. ఆప్ కీ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మగ్బూల్ బాష, రాష్ట్ర అధ్య క్షుడు ఆరిఫ్ ఖాన్, నాయకులు ముస్తాక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాదుస్తులు పంపిణీ



క్రీడాకారులతో హ్యాండ్‌బాల్ సంఘం, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

కడప స్పోర్ట్స్: ఈనెల 18, 19న ఒంగోలులో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు విజేతలుగా రాణించాలని జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం అధ్యక్షుడు లయన్ కె. చిన్నపరెడ్డి కోరారు. శుక్రవారం డీఎస్ఏ క్రీడామైదానం ఆవరణంలో హ్యాండ్‌బాల్ శిక్షణ శిబిరం ముగింపు, క్రీడాకారులకు క్రీడాదుస్తులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నపరెడ్డి, లయన్స్‌క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షుడు పోతుల వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులకు అండగా నిలుస్తామన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమ య్య కార్యదర్శి కొండూరు జనార్ధన్‌రాజు, కోశాధికారి రవి, సంజీవరెడ్డి, కొండారెడ్డి, జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ శివప్రసాద్, కోచ్ అబ్దుల్ మునాఫ్ పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రస్తుత సీజన్‌లో దోమల నివారణకు ప్రతి ఒక్కరూ తగిన చర్యలు చేపట్టాలని అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్‌కు చెందిన డాక్టర్ ప్రశాంత్ వర్ధన్ తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రైడే–ఫ్రైడేగా పాటించాలని సూచిస్తూ నగరంలోని పిండిమిషన్ వీధిలో హౌస్ విజిట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కిటికీలకు మెష్‌లు బిగించుకోవాలని సూచించారు. నీటిని నిల్వ ఉంచకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్నలత, శిక్షణా వైద్యులు సుందర్, పవన్‌కల్యాణ్, గుల్జార్‌బేగం పాల్గొన్నారు.

జీతాల సమస్య పరిష్కరించాలి



దీఈఓ కార్యాలయ పరిపాలనాధికారికి నోటీసు అందచేస్తున్న ఫ్యాప్టో నాయకులు

కడప ఎడ్యుకేషన్: బదిలీల కారణంగా ఏర్పడిన సమస్యతోపాటు ఉపాధ్యాయుల జీతాలు సక్రమంగా రావడం లేదని, ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఫ్యాప్టో జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. బదిలీలు జరిగి 3 నెలలు కాకుండానే మరలా ఉపాధ్యాయులను పని సర్దుబాటు చేయడం పట్ల ఫ్యాప్టో తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. పని సర్దుబాటు ప్రక్రియను నిలుపుదల చేయాలని 19వ తేదీ సాయంత్రం 5 గంటలకు కడప డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించిన నోటీసును శుక్రవారం సాయంత్రం విద్యాశాఖ కార్యాలయ పరిపాలనాధికారి మునీర్‌ఖాన్‌కు వారు అందచేశారు. ఫ్యాప్టో జిల్లా ట్రెజరర్ వెంకటసుబ్బయ్య , ఫ్యాప్టో నాయకులు పాలెం నారాయణ, మహేష్‌బాబు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి మేలు

– ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: జగనన్న ప్రభుత్వంలో కుల మతాలు, పార్టీలకతీతంగా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్ బాషా అన్నారు. ×గడప గడపకు మన ప్రభుత్వం॰ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక 27వ డివిజన్‌లోని గౌస్ నగర్, గంజికుంట కాలనీ ప్రాంతాల్లో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. పలువురు తమ సమస్యలను తెలుపగా వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా షేక్ ఇమాం బీ మాట్లాడుతూ తనకు వైఎస్సార్ పింఛన్ కానుక, జగనన్న అమ్మ ఒడి, జగనన్న ఇంటి స్థలం ద్వారా రూ.9.93లక్షలు మేలు జరిగిందని తెలిపింది. షేక్ హుస్సేన్ అనే వ్యక్తి మాట్లాడుతూ వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ పింఛన్ కానుక, వైఎస్సార్ సున్నా వడ్డీ, జగనన్న తోడు, ఇంటి స్థలం ద్వారా తమకు రూ.9.88లక్షలు మేలు జరిగిందని సంతోషం వ్యక్తం చేశారు. షేక్ మహబూబ్ ఛాన్ అనే మహిళ మాట్లాడుతూ వైఎస్సార్ చేయూత, జగనన్న ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి నగదు ద్వారా రూ.9.06లక్షలు లబ్ధి చేకూరిందని తెలిపింది. పేదలకు మేలు చేస్తున్న ఈ ప్రభుత్వమే మళ్లీ రావాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, కార్పొరేటర్ ఎస్ అరీఫ్, కో ఆప్షన్ సభ్యులు ఎస్ఎండీ జహీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు త్యాగరాజు, షఫీ, సుబ్బారెడ్డి, తోటక్రిష్ణ, మున్నా, అరీఫుల్లా, మనోజ్, పవర్ అల్తాఫ్, టీపీ వెంకట సుబ్బమ్మ, బండి మరియలు, తులశమ్మ, సుశీలమ్మ, విజయకుమారి పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

– ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ప్రజలను కోరారు. శుక్రవారం మండలంలోని ఉరుటూరు గ్రామంలో రెండవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలు అందని వారెవరైనా ఉంటే తెలపాలన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజల సమస్యలను తెలుసుకోవడంతో పాటు వాటిని పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖలకు సంబంధించిన మండలస్థాయి అధికారులు పాల్గొనడం వలన చాలా వరకు ప్రజా సమస్యలను పరిష్కరించడం జరుగుతోందన్నారు. ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టినా ప్రజలకు తెలపాలన్న సంకల్పంతో ప్రతి 50 కుటుంబాలకు వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. ప్రజల కష్టాలను దృష్టిలో పెట్టుకుని ఇటువంటి మంచి పరిపాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మండలంలోని 15 సచివాలయ పరిధిలోని 22 పంచాయతీల్లో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలకు అపూర్వ స్పందన లభించింది. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, గడ్డంవారిపల్లె సహకార సంఘం అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి జాఫర్ సాధిక్, ఉపాధి ఏపీఓ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

– ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ సుబ్బరాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ సుబ్బరాజు

కడప కార్పొరేషన్: ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని సులభతరంగా పనిచేయాలని ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ సుబ్బరాజు అన్నారు. శుక్రవారం కడప డివిజన్ విద్యుత్ కార్యాలయంలో కడప డివిజన్ పరిధిలోని కడప, చింతకొమ్మదిన్నె, పెండ్లిమర్రి, వల్లూరు, చెన్నూరు మండలాల క్షేత్రస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్యాలను నిర్దేశించుకుని పని చేస్తే ఫలితాలు అద్భుతంగా ఉంటాయి. అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకుని సులభతరంగా అంతరాయ కారణాలు తెలుసుకోవాలన్నారు. లైన్లు మరియు ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వాహణకు జరుగుతున్న జిఐఎస్ సర్వేను అధిక ప్రాధాన్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. లైన్ల లో తిరిగి సమస్యలను గుర్తించాలని, ముందస్తు మరమ్మతులు చేయడం ద్వారా అంతరాయాలను అరికట్టి నిరంతర నాణ్యమైన విద్యుత్ అందించాలని ఆదేశించారు. విద్యుత్ బకాయిల వసూళ్లపై ప్రాధాన్యతతో దృష్టి సారించాలన్నారు. విద్యుత్ బిల్లులపై వచ్చే వ్యత్యాసాలు అధిగమించడానికి ఆధునిక పద్ధతిలో ఐఆర్‌డీఏ పోర్టు ద్వారా ఆటోమేటిక్ రీడింగ్ తీసే విధానాన్ని నూరు శాతం మీటర్లకు తీయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకి పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరాలో ఎటువంటి జాప్యం లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఓఎస్‌డీ శ్రీనివాసులు, అకౌంట్స్ ఆఫీసర్ మధు, ఈఈ నరసింహ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడం చారిత్రాత్మకం

కడప రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడం చారిత్రాత్మక నిర్ణయం అని ఏపీ హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి ఆదాల వెంగల్‌రెడ్డి, మేసా ప్రసాద్ తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రెగ్యులర్ చేసి ఉద్యోగులకు మేలు చేశారన్నారు. కాగా కాంట్రాక్ట్ ఉద్యోగులు గత 20 ఏళ్ల నుంచి రెగ్యులర్ కోసం ఎదురు చూశారన్నారు. ఎట్టకేలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి ఫలితంగా ఆ ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నిండాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రజా సంకల్ప పాదయాత్రలో కాంట్రాక్టు పద్ధతిన పనిచేసే ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన హామీ మేరకు సిబ్బందిని రెగ్యులర్ చేసి మాట నిలబెట్టుకున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్టు పారా మెడికల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు పి.వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని అన్ని శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వైద్య ఆరోగ్యశాఖలో 3396 మంది కాంట్రాక్టు ఉద్యోగులందరూ రెగ్యులర్ కానున్నారన్నారు. సీఎం రుణం ఎప్పటికీ తీర్చుకోలేమన్నారు.

శ్రీ రాజేశ్వరీమాతకు విశేష అలంకారం



కడప కల్చరల్ : కడప నగరం మున్సిపల్ మైదానంలోని శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారికి విశేష అలంకారం నిర్వహించారు. శ్రావణమాసం తొలి శుక్రవారం కావడంతో ఆలయ ప్రధాన అర్చక బృందం అమ్మవారికి అభిషేకం చేసి కనుల పండువగా అలంకరించారు. అనంతరం విశేష పూజలు నిర్వహించారు. శ్రావణ శుక్రవారం అమ్మవారిని దర్శించుకోవడం మంగళ ప్రదంగా భావించిన స్థానిక భక్తులు తెల్లవారుజాము నుంచి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

తగ్గిన కూరగాయల ధరలు



కడప అగ్రికల్చర్: మొన్న మొన్నటి దాకా భగ్గుమన్న కూరగాయల ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. దీంతో వినియోగదారులు ఊరట చెందుతున్నారు. 10 రోజుల క్రితం కిలో రూ. 100 ఉన్న టమాట ధర ప్రస్తుతం రూ. 45కు చేరింది. అలాగే కిలో రూ. 250 ఉన్న అల్లం ధర రూ. 180 చేరింది. గత పది రోజుల నుంచి కిలో కాప్సికం ధర రూ. 90తో స్థిరంగా అలాగే కొనసాగుతోంది. క్యారెట్, బీన్స్‌లు మాత్రం కిలో రూ. 60 కొనసాగుతుండగా మిగతా కూరగాయల ధరలు తక్కువగా ఉన్నాయి. కాలీఫ్లవర్ కిలో రూ. 45, బీట్రుట్, అనపకాయలు, అలసందలు కిలో రూ. 40 ఉంది. ముల్లంగి, దొండకాయలు, బంగాళాదుంప, బీరకాయలు కిలో రూ. 35 పలుకుతున్నాయి. క్యాబేజి, దోసకాయ, కీరకాయలు కిలో రూ. 30 ఉన్నాయి. వంకాయ, కాకరకాయ, మట్టిక్కాయలు కిలో రూ. 25 ధర పలుకుతున్నాయి. ఆకుకూరల ధరలు అందుబాటులో ఉన్నాయి.

ఆదర్శప్రాయుడు నేతాజీ



నేతాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ ఆచార్య ఆంజనేయప్రసాద్, అధ్యాపకులు

ఏఎఫ్‌యూ: స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్‌చంద్రబోస్ పోరాట పటిమ నేటి యువతకు ఆదర్శప్రాయమని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య బానోతు ఆంజనేయప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం డా. వైఎస్ఆర్ ఏఎఫ్‌యూలో సుభాష్ చంద్రబోస్ వర్ధంతి నిర్వహించారు. నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్ రెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఇ.సి. సుప్రియ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. ఉషా మాధురీ, రమాదేశి, నేషనల్ ఈవెంట్ కోఆర్డినేటర్ మనోహర్‌రావు పాల్గొన్నారు.

'వీరులకు వందనం'

కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా వీరులకు వందనం పేరుతో మాజీ సైనికులను సన్మానించారు. వీసీ ఆచార్య బి. ఆంజనేయప్రసాద్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల సేవలను స్మరించుకునేందుకు వీరులకు వందనం కార్యక్ర మం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబసభ్యులు టీకూరు సురేష్‌కుమార్‌రెడ్డి, మాజీ సైనికులు బాలవీరారెడ్డి, గోపాల్‌రెడ్డిలను సన్మానించారు.

డీసీసీబీ సేవలను వినియోగించుకోండి



మాట్లాడుతున్న బ్యాంక్ కార్యనిర్వహణాధికారి రాజేంద్రకుమార్

వల్లూరు : ప్రజలు డీసీసీ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి రాజేంద్రకుమార్ తెలిపారు. గడప గడపకై కడప బ్యాంకు కార్యక్రమంలో భాగంగా వల్లూరు పీఏసీఎస్ పరిధిలో శుక్రవారం ఆయన పర్యటించి వల్లూరులోని రైతులు, బ్యాంకు ఖాతాదారుల గృహాల వద్దకు వెళ్లి బ్యాంకు సేవలను గురించి వివరించారు. రైతులు, చిరు వ్యాపారులు, మహిళలు మరియు గ్రామీణాభివృద్ధే ప్రధాన ధ్యేయంగా డీసీసీ బ్యాంకు పనిచేస్తోందన్నారు. డిపాజిట్లపై రుణ సౌకర్యంతోపాటు నెలవారీ వడ్డీ, త్రైమాసికి వడ్డీ చెల్లింపు సౌకర్యం అందుబాటులో వుందన్నారు. తక్కువ బ్యాలెన్స్‌తో అకౌంట్ ఓపెన్ చేయడంతోపాటుగా డెబిట్ కార్డును ఇస్తామన్నారు. సేవింగ్స్ ఖాతాదారులకు రూ.2 లక్షల వరకు ఇన్సూరెన్స్ సౌకర్యం వుంటుందన్నారు. సేవింగ్స్ ఖాతాలోని బ్యాలెన్స్‌పై 3.75 శాతం వడ్డీ చెల్లిస్తామన్నారు. లాకర్ సౌకర్యంతో పాటు బంగారంపై రున సౌకర్యం వుందన్నారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి బ్యాంకు అభివృద్ధికి తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో ఏజీఎం రాజు, మేనేజర్ శ్రీనివాసులు, సూపర్‌వైజర్ రామాంజులురెడ్డి, పీఏసీఎస్ సీఈఓ రామచంద్రయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

వరి పంటలో కాలిబాటలు తప్పనిసరి

కమలాపురం : వరి పంటలో కాలిబాటలు తప్పనిసరిగా తీయాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని టి.చదిపిరాళ్లలో నిర్వహించిన డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో ఆయన రైతులకు వరి పంట సాగు, చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యల గురించి అవగాహన కల్పించి మాట్లాడారు. వరి పంటలో కాలి బాటలు తప్పనిసరిగా తీయాలన్నారు. ప్రతి 2 మీటర్లకు 20 సెం.మీ. చొప్పున కాలిబాటలు తీస్తే సుడిదోమ పురుగును నివారించవచ్చన్నారు. వరినాట్లు వేసే సమయంలో నారు కొనలు తుంచి నాటాలన్నారు. తద్వారా కాండం తొలుచు పురుగును గుడ్డు దశలోనే నివారించవచ్చన్నారు. వరి పంట నాటిన రెండు వారాల తర్వాత కార్బో ఫ్యూరాన్ 3జీ లేదా కార్టప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలను తప్పనిసరిగా వాడాలన్నారు. తద్వారా కాండం తొలుచు పురుగు, ఉల్లికోడు, ఆకుముడత పురుగులను నివారించవచ్చన్నారు. ఏఓ సరస్వతి మాట్లాడుతూ రైతులు ఎరువుల యాజమాన్యాలను చేపట్టాలన్నారు. కాంప్లెక్స్ ఎరువులను పైపాటుగా ఎట్టి పరిస్థితుల్లోను వేయరాదని సూచించారు. యూరియాను పంటకు మూడు విడతలుగా వేయాలన్నారు. వ్యవసాయ అధికారుల సూచనలను రైతులు తప్పకుండా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ దస్తగిరి, వీఏఏలు మమత, వెంకటకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

వైవీయూ : కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఫేర్‌వెల్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మానవత స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి, సినీ నటుడు కార్తికేయ విచ్చేసి ఉపన్యసించారు. వారు మాట్లాడుతూ మహిళలు బాగా చదువుకున్నప్పుడే సమాజం అన్ని విధాలుగా అభివృద్ధి సాధిస్తుందన్నారు. బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ పరిరక్షించాలన్నారు. అనంతరం మహిళలకు ఉన్న అవకాశాలు, వారికి రక్షణగా ఉన్న వివిధ రకాల చట్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ బైరెడ్డి రామకృష్ణారెడ్డి, డైరెక్టర్ శివవిష్ణుమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉండవల్లి శ్రీదేవికి ప్రజలే బుద్ధి చెబుతారు

– వైఎస్సార్‌సీపీ జోనల్ కార్యదర్శి రత్నకుమారి

కడప కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గూర్చి తప్పుగా మాట్లాడుతున్న ఉండవల్లి శ్రీదేవికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాయలసీమ జోనల్ ఇంచార్జ్ ఎం.కె. రత్నకుమారి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీకి ఓటు వేసిన ఆమె ప్రస్తుతం ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉండి బూతులు మాట్లాడటం సిగ్గు అనిపించలేదా అని ప్రశ్నించారు. నిన్నటి వరకు జగన్ నా గుండె చప్పుడు అని చెప్పిన మీకు ఇప్పుడు ఆ చప్పుడు ఏమైందని ప్రశ్నించారు. చిన్నారుల గుండె ఆపరేషన్లకు సాయం చేసేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని చెప్పిన మీరు ఇప్పుడు ఎందుకు విమర్శిస్తున్నారని ప్రశ్నించారు. ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తున్న సీఎంను విమర్శించడం సిగ్గుచేటన్నారు.

పారా వెటర్నరీ చట్టాన్ని అమలు చేయాలి

కడప అగ్రికల్చర్: పారా వెటర్నరీ కౌన్సిల్ యాక్ట్ 2023ను పూర్తిస్థాయిలో అమలు చేసి పశుసంవర్థశాఖ ఉద్యోగులకు న్యాయం చేయాలని ఏపీ ఎన్‌జీవీఎఫ్ జిల్లా చైర్మన్ నంద్యాల రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఈ విషయమై శుక్రవారం జిల్లా పర్యటనకు విచ్చేసిన పశుసంవర్థశాఖ రాష్ట్ర సంచాలకులు అమరేంద్రకుమార్‌కు జిల్లా బహులార్థ పశువైద్యశాలలో వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా నంద్యాల రాజశేఖర్ మాట్లాడుతూ ఏహెచ్‌ఏలకు వెటర్నరీ అసిస్టెంట్‌గా ప్రమోషన్‌ను కల్పించాలన్నారు. అలాగే సచివాలయ వ్యవస్థలో పనిచేస్తున్న పశుసంవర్థశాఖ సహాయకులకు బదిలీలను నిర్వహించాలన్నారు. పశుసంవర్ధశాఖలో ఖాళీగా ఉన్న వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీవీఎఫ్ జిల్లా కార్యవర్గసభ్యులు సదాశివయ్య, వెంకటసుబ్బయ్య, విద్యాసాగర్, మనీ, బాబు, నాయక్, షాహిదాబేగం, హిమబిందు పలువురు నాయకులు పాల్గొన్నారు.

గ్రూప్‌-1 విజేతకు సత్కారం

వైవీయూ : కడపలోని శ్రీహరి డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థి (2014-17 బ్యాచ్ బీఎస్సీ బీజెడ్‌సీ) మేరువ చందు గ్రూప్‌-1లో విజేతగా నిలిచి సేల్‌టాక్స్ సర్వీసెస్‌లో అసిస్టెంట్ కమిషనర్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శ్రీహరి డిగ్రీ కళాశాల యాజమాన్యం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన మేరువ చందు మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా సన్నద్ధం అయితే విజయాలు సాధించవచ్చన్నారు. కళాశాల కరస్పాండెంట్, వైవీయూ పాలకమండలి సభ్యుడు జి. సుబ్బారెడ్డి , కళాశాల ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న సురేష్‌బాబు

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన ప్రముఖ జ్యోతిష్య శాస్త్ర నిపుణులు ఎం.సురేష్‌బాబు శుక్రవారం స్థానిక ఎన్జీఓ కాలనీలోని తన స్వగృహంలో పేద మహిళలకు దుస్తులు పంపిణీ చేశారు. తన కుమార్తె సుహితా షారోన్ 15వ జన్మదినాన్ని పురస్కరించుకుని 300 మందికి పైగా వస్త్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన కుమార్తెతో కేక్ కట్ చేయించి అందరికీ పంచి పెట్టారు.

అవార్డు గ్రహీతలకు అభినందన

కడప కల్చరల్ : జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ద్వారా స్వాతంత్ర్య దినోత్సవం నాడు అవార్డును అందుకున్న వారిని లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య శుక్రవారం సత్కరించింది. సంస్థ అధ్యక్షులు పోతుల వెంకట్రామిరెడ్డి, కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు లయన్స్ క్లబ్ కార్యాలయంలో ఈ కార్యక్రమం చేపట్టారు. జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య, ఏఆర్ ఎస్ఐ బోగాల కొండారెడ్డిలతోపాటు పాత్రికేయుడు సూరిబాబుకు అవార్డులు దక్కినందుకు వారిని ఘనంగా సత్కరించారు.

వర్క్‌షాప్ పోస్టర్ ఆవిష్కరణ

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం, అడ్వాన్స్‌డ్ సైకలాజికల్ సర్వీసెస్ అసోసియేషన్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2, 3 తేదీల్లో నిర్వహించనున్న జాతీయ వర్క్‌షాపునకు సంబంధించిన పోస్టర్‌ను వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ ఆవిష్కరించారు. శుక్రవారం వైవీయూలో పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి, సైకాలజీ విభాగాధిపతి డాక్టర్ కె. లలిత, సహ ఆచార్యులు డా. వి. లాజరస్‌తో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు.

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

చెన్నూరు : కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని సన్‌రైజ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మండల వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు.

ఫొటోగ్రఫీ అద్భుతమైన కళ

కడప కల్చరల్ : ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో జిల్లాకు చెందిన పర్యాటక, అటవీ ప్రాంతాల ఫొటోల ప్రదర్శన నిర్వహించారు. స్థానిక ఫొటోగ్రాఫర్ వేముల శివ జిల్లా పర్యాటక రంగ ఫొటోలను ప్రదర్శనకు ఉంచారు. పుష్పగిరి, ఒంటిమిట్ట, గండికోట తదితర ఫొటోలు ఆకట్టుకున్నాయి. ఇంజనీరు ఎ.మౌనిక జిల్లాలోని పలు ప్రాంతాల్లో నివసిస్తున్న పక్షిజాతుల ఫొటోలను ప్రదర్శించారు. డాక్టర్ ఎస్‌పీ వెంకట రమణ తన పరిశోధనలో భాగంగా తీసిన పలు జాతుల సీతాకోక చిలుకల ఫొటోలు ముచ్చటగొలిపాయి. ప్రముఖ ఫొటోగ్రాఫర్ యల్లేశ్వరరావు, ఎస్‌పీ వెంకట రమణ అరుదైన పురాతన కెమెరాలను ప్రదర్శనలో ఉంచి పనితీరును వివరించారు. బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఫొటోగ్రఫీ సృజనాత్మక నైపుణ్యానికి అద్దం పట్టే అద్భుత కళ అన్నారు. ఈ ఫొటో ప్రదర్శన శనివారం కూడా కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైవీయూ జువాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్‌పీ వెంకట రమణ, ఇంజనీరు మౌనిక, పద్మప్రియ చంద్రారెడ్డి, వేముల శివ, యల్లేశ్వరరావు, కోటేశ్వరరావు, శంకర్‌రెడ్డి, సుబ్బు తీట్ల బాబు, రుదిరెడ్డి బాబు, సురేష్‌బాబు, ఓబులేశులను సత్కరించారు.

నేడు బండలాగుడు పోటీలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని అప్పరాజుపల్లెలో వెలసిన ఆంజనేయస్వామి దేవస్థానం నందు శ్రావణ మాస శనివారాన్ని పురష్కరించుకుని బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం స్వామి వారికి ధ్వజ స్తంభ, నవగ్రహ, ప్రతిష్ట మహోత్సవం జరుగుతుందన్నారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో గెలుపొందినవారికి 9 రకాల బహుమతులను అందజేస్తామన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొప్పర్తి పంచాయతీ పరిధిలోని ఎర్రమాచుపల్లె గ్రామంలో శనివారం జరిగే గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, సీకేదిన్నె జడ్పీటీసీ పి.నరేన్ రామాంజులు రెడ్డిలు పాల్గొంటారని మండల కన్వీనర్ గూడ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలన్నారు.